క్లుప్తంగా

వరి కొయ్యలు కాల్చొద్దు

రఘునాథపాలెం: వరి కొయ్యలు, చెత్తచెదారాన్ని కాల్చొద్దని, తద్వారా భూసారం దెబ్బతింటుందని వీవీపాలెం వ్యవసాయశాఖ ఏఈఓ బి.శిరిణ్మయి రైతులకు సూచించారు. బుధవారం వీవీ పాలెం క్లస్టర్‌లో కొంతమంది రైతులు వరి కొయ్యలను దగ్ధం చేస్తుండగా.. అక్కడకు వెళ్లి అవగాహన కల్పించారు. పంట అవశేషాలను తగలబెట్టడం వలన జరిగే నష్టాలను వివరించారు.

తిమ్మక్కపేటలో ఉచిత పశువైద్య శిబిరం


శిబిరంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

తిరుమలాయపాలెం: మండలంలోని తిమ్మక్కపేటలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన బుధవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పాడి పశువులకు కృత్రిమ గర్భధారణ, గర్భకోశ వ్యాధి నివారణ, లేగదూడలకు నట్టల నివారణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సుబ్లేడు వీఏఎస్ డాక్టర్ ఎస్‌కె జానీ, గోపాలమిత్ర సూపర్‌వైజర్ కాజా నతికుద్దీన్, గోపాల మిత్రులు చుంచు మధార్, తుమాటి శ్రీను, దరిపల్లి భాస్కర్, నేలమర్రి నారాయణ, మట్టే వీరబాబు, రైతులు పాల్గొన్నారు.

‘అన్నం’ సేవలు ఆదర్శం

ఖమ్మంఅర్బన్: నగరంలోని అన్నం సేవాశ్రమంలో అందిస్తున్న సేవలు పలువురికి ఆదర్శమని జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి కేవీ చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. బుధవారం ఆశ్రమాన్ని సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈమేరకు ఆశ్రమంలో దివ్యాంగులు, వృద్ధులు, అనాథలకు అందిస్తున్న సేవలను పరిశీలించి అన్నం సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

నిరసన

ఖమ్మంఅర్బన్: హైదరాబాద్‌లో ఎన్టీఆర్ ఘాట్ స్థానంలో నూతన అసెంబ్లీ నిర్మాణం చేయాలన్నా కోమటిరెడ్డి రాజ గోపాలరెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం ఎన్టీఆర్, బాలయ్య అభిమానులు ఖమ్మంలో నల్ల రిబ్బన్‌లు కట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. జిల్లా తెలుగు యువత నాయకుడు నల్లమల రంజిత్, సతీష్, మధు తారక్, శేఖర్, రాజేశ్వరి, ప్రభు, రామక్రిష్ణ, నరేష్, ఉదయ్, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

రఘునాథపాలెం: ట్రాన్స్‌పార్మర్‌లోని రాగి తీగ కోసం కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు మండలంలోని గణేశ్వరంలో వ్యవసాయ మోటార్లకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌ను మంగళవారం రాత్రి ధ్వంసం చేశారు. ఈమేరకు సంబంధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఇటీవల కాలంలో రైతుల మోటార్ల చోరీతో పాటు ట్రాన్స్‌పార్మర్లు, అందులోని రాగి తీగలను చోరీ చేస్తున్నారని గ్రామానికి చెందిన రైతులు శ్రీను, భద్రు, బోడా వెంకటేశ్ తదితరులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జరిమానా

ఖమ్మంఅర్బన్: దుకాణానికి అడ్డుగా ఉందని చెట్టును తొలగించిన భవాని ప్లైవుడ్, హర్డ్వేర్ దుకాణదారుడికి మున్సిపల్ అధికారులు బుధవారం జరిమానా విధించారు. నగరంలోని 12వ డివిజన్ ఖమ్మం–వైరా ప్రధాన రోడ్డు పర్ణశాల రామాలయం ఎదురుగా ఉన్న పుగాడ రకం చెట్టును దుకాణదారుడు తొలగించగా.. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, సూపర్ వైజర్ సాంబయ్యలు అతడికి రూ.5వేల జరిమాన విధించారు. ఎవరైనా చెట్లను తొలగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

అంగన్‌వాడీ టీచర్‌కు గాయాలు

నేలకొండపల్లి: మండలంలోని పైనంపల్లికి చెందిన అంగన్‌వాడీ టీచర్ నాగలక్ష్మి బుధవారం విధులు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తున్నారు. ఈక్రమంలో జాతీయ రహదారి పుట్‌పాత్‌పై నడుస్తుండగా.. కోదాడ నుంచి నేలకొండపల్లికి వెళ్తున్న ట్రాక్టర్ పుట్‌పాత్ పైకి ఎక్కి ఢీకొట్టింది. దీంతో గాయాలు కావడంతో స్థానికులు ఖమ్మంకు తరలించారు. అంతకుముందే అంగన్‌వాడీ చిన్నారులను రోడ్డు దాటించగా.. ఇంతలోనే ప్రమాదం జరిగింది. దీంతో చిన్నారుల తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	పుష్ప 2
వినోద	పుష్ప 2
సాయిరాం	మిస్ యూ
ఆదిత్య	పుష్ప 2
శ్రీనివాస	పాని
సినీ గెలాక్సీ	పుష్ప 2

- ఖమ్మంగాంధీచౌక్

రాత్రి ప్రయాణాలు మానుకుంటే మేలు




వరప్రసాద్, ఇన్‌చార్జ్ ఆర్‌టీఓ, ఖమ్మం

ఖమ్మంక్రైం: విపరీతమైన చలికి తోడు మంచు కురుస్తుండడం .. చలితో చేతులకు పట్టు లభించే అవకాశం ఉండనందున రాత్రి సమయాన ప్రయాణాలతో ప్రమాదాలు ఎదురయ్యే అవకాశముంది. రాత్రివేళ సాధ్యమైనంత మేర దూరం వెళ్తే ఉదయం ఇతర పనులు చేసుకోవచ్చని భావిస్తుంటారు. కానీ ప్రస్తుత సమయాన రాత్రి ప్రయాణాలు మానుకుంటేనే మేలని ఖమ్మం ఇన్‌చార్జ్ ఆర్‌టీఓ వరప్రసాద్ సూచించారు. ఈ మేరకు వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన వెల్లడించిన వివరాలు... త్వరలో క్రిస్మస్ సెలవులు, నూతన సంవత్సరం వేడుకలకు పలువురు విహార యాత్రలకు వెళ్లే అవకాశముంది. మధ్య తరగతి ప్రజలు కూడా సొంత కార్లు ఉపయోగిస్తుంటారు. ఇప్పుడు చలి ప్రభావం ఉన్నందున పగటి వేళ ప్రయాణాలకే ప్రాధాన్యం ఇవ్వాలి. తప్పనిసరి రాత్రిపూట వెళ్లాల్సి వస్తే కారుకు ఫాగ్ ల్యాంప్‌లు వేసుకోవాలి. అలాగే ఎమర్జెన్సీ లైట్లు కూడా వాడాలి. వేగంగా కాకుండా 40 నుంచి 50 కి.మీ.కు మించి వేగంతో వెళ్లొద్దు. తెల్లవారుజామున మంచు ప్రభావం ఎక్కువగా ఉంటున్నందున కారు వైపర్లు పనిచేస్తున్నాయో, లేదో పరీక్షించుకోవాలి. అలాగే, కారులో హీటర్ పనితీరును గమనించాలి. ఇక ద్విచక్రవాహనదారులు సైతం రాత్రివేళ ప్రయాణించాల్సి వస్తే ఎమర్జెన్సీ లైట్లు తప్పక వాడాలి. చేతులకు గ్లౌస్ వేసుకుంటే పట్టు ఉంటుంది.

చలివేళ.. గ్యాడ్జెట్ల వాడకంలో అప్రమత్తత




జి.కోటి, ఖమ్మం

ఖమ్మం మయూరిసెంటర్: ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయిలో నమోదవుతున్నప్పుడు కంప్యూటర్లు, సెల్‌ఫోన్లలోని విడిభాగాలు ప్రభావితం అవుతాయి. ఈ మేరకు వీటిని ఉపయోగించే వారు చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఖమ్మంకు చెందిన హార్డ్‌వేర్ నిపుణుడు జి.కోటి వివరించారు. మంచు కురిసే సమయాన బయటి ప్రదేశాల్లో ల్యాప్‌టాప్, మొబైల్స్ వాడితే తెలియకుండానే మంచు లోపలికి వెళ్లే ప్రమాదముంటుంది. ఈ కారణంగా తడితో విడిభాగాలు కాస్త దెబ్బతింటాయి. అందువల్ల మంచు కురిసే ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్స్ వస్తువుల వినియోగం తగ్గించడం మంచిది. తక్కువ ఉష్ణోగ్రతలు నమోదైనప్పుడు కంప్యూటర్లు, ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్స్ వస్తువుల విడిభాగాలపై కొంత ప్రభావం ఉంటుంది. ఇదే సమయాన సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్స్‌పై మాత్రం ఎలాంటి ప్రభావం చూపదు. ఇక కలర్ ప్రింటర్లను ప్రతిరోజు తప్పక వినియోగించాలి. ఇందులో భాగంగా రోజుకొక ప్రింట్ అయినా తీయాలి. తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే సమయంలో వీటిని వినియోగించకుంటే పని చేయడం ఆగిపోతాయి.

సర్వేలో తప్పిదాలకు తావివ్వొద్దు

కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య


సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: ఇందిరమ్మ ఇళ్ల యాప్ సర్వేలో ఎలాంటి తప్పిదాలకు తావివ్వకుండా పని చేయాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. బుధవారం నగరంలోని పలు డివిజన్లలో జరుగుతున్న సర్వే తీరును పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. యాప్‌లో ఉన్న వివరాల ఆధారంగా లబ్ధిదారులు ఇచ్చే వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. అర్హులకు లబ్ధి జరిగేలా ప్రభుత్వం ఈ సర్వే చేయిస్తుందని చెప్పారు.

అంబేడ్కర్ గురుకుల కళాశాల సందర్శన

నగరంలోని ఎస్సీ సంక్షేమ శాఖకు చెందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలను కమిషనర్ అభిషేక్ అగస్త్య, శిక్షణ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠతో కలిసి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి కళాశాలలో వారికి అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు.

రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్/ఖమ్మంరూరల్/తిరుమలాయపాలెం: సమగ్ర శిక్షా ఉద్యోగి కె.హైమావతి కుటుంబానికి 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి న్యాయం చేయాలని, అదేవిధంగా సమగ్ర శిక్ష ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఝాన్సీ సౌజన్య, జిల్లా అధ్యక్షుడు షేక్ మహబూబ్ పాషాలు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యాశాఖలో సమగ్ర శిక్షాలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు గత పది రోజుల నుంచి సమ్మె చేస్తున్న నేపథ్యాన జరిగిన పరిణామాలతో మానసిక ఒత్తిడికి గురైన తిరుమలాయపాలెం ఎంఆర్‌సీలో సీసీఓగా పనిచేస్తున్న కె.హైమావతి గుండెపోటుతో మంగళవారం రాత్రి మరణించిందన్నారు. ప్రభుత్వం స్పందించి ఎక్స్‌గ్రేషియాతో పాటు మృతురాలి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్, నాయకులు వీరస్వామి, కనకయ్య, విజయలక్ష్మి, అనిల్, ఇస్మాయిల్, మదార్, సైదులు, సాంబశివరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఖమ్మంరూరల్ మండలంలో బుధవారం జరిగిన హైమావతి సంతాప కార్యక్రమం సందర్భంగా ఆమె స్వగ్రామమైన పెదతండాలో 300మంది ఉద్యోగులతో ర్యాలీ నిర్వహించారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం


దుప్పట్లు అందుకున్న విద్యార్థులతో గోపాల్‌రెడ్డి

కామేపల్లి: ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని తెలంగాణ వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ సభ్యుడు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. పాతలింగాల గ్రామంలోని కేజీబీవీ పాఠశాలలో 290 మంది విద్యార్థులకు ప్రభుత్వం అందించిన దుప్పట్లను బుధవారం పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అందించే సౌకర్యాలను వినియోగించుకుని మెరుగైన ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకట్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, దమ్మాలపాటి సత్యనారాయణ, రాంరెడ్డి జగన్నాథరెడ్డి, నల్లమోతు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మిడ్ డే మీల్స్ పరిశీలన

తిరుమలాయపాలెం: మండలంలోని సుబ్లేడు జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని జిల్లా వ్యవసాయ సంచాలకుడు ధనసిరి పుల్లయ్య బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మధ్యాహ్న భోజన తయారీ వర్కర్లతో మాట్లాడి నాణ్యమైన భోజనం అందించాలన్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం గ్రామంలో క్రాప్ బుకింగ్ వెరిఫికేషన్ చేసి వరి పంట రైతులకు పలు సూచనలు చేశారు. మండల వ్యవసాయ అధికారి నారెడ్డి సీతారామరెడ్డి, ఏఈఓ బాలకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

ఇంధన పొదుపుపై వ్యాసరచన పోటీలు

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ(టీజీ రెడ్‌కో) ఆధ్వర్యంలో ఇంధన పొదుపు వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం నయాబజార్ ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యార్థులకు ఇంధన పొదుపుపై వ్యాస రచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించడంతో పాటు నయాబజార్ స్కూల్ నుంచి కాల్వొడ్డు సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి ఇంధన పొదుపుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.సుధారాణి, ఇతర ఉపాధ్యాయులు, టీజీ రెడ్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు నోటీసులు

నేలకొండపల్లి: సదరమ్ సర్టిఫికెట్లు జారీ విషయమై ఖమ్మం పెద్దాస్పత్రి సూపరింటెండెంట్‌కు లోకాయుక్త నోటీసులు జారీ చేసిందని నేలకొండపల్లికి చెందిన సైదులు తెలిపారు. పాలేరు నియోజకవర్గంలో పలువురికి అర్హత లేకున్నా సదరమ్ సర్టిఫికెట్లు జారీ చేశారని లోకాయుక్తలో ఫిర్యాదు చేయగా..నోటీసులు జారీ అయ్యాయని పేర్కొన్నారు. ఈనెల 20వ తేదీలోగా పూర్తి వివరాలతో హాజరుకావాలని అందులో సూచించినట్లు తెలిపారు. కాగా, ఈ విషయాన్ని అధికారులు ధ్రువీకరించాల్సి ఉంది.

జయప్రదం చేయండి

ఖమ్మంమయూరిసెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం): మాల మహానాడు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యాన గురువారం నిర్వహించే చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి మాలలు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని మాల మహానాడు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా కన్వీనర్ గుంతెటి వీరభద్రం విజ్ఞప్తి చేశారు. బుధవారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలుచేయాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కోకన్వీనర్లు, జిల్లా కోకన్వీనర్లు గౌరవ సలహాదారులు, రాష్ట్ర కో చైర్మన్లు పాల్గొన్నారు.

సీపీఐ వందేళ్ల కార్యక్రమాన్ని..

సీపీఐ వందేళ్ల కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మొహమ్మద్ సలాం విజ్ఞప్తి చేశారు. బుధవారం ఖమ్మం పాత రైతుబజార్ సెంటర్‌లో నిర్వహించిన వీధి వ్యాపారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 26న నగరంలోని భక్త రామదాసు కళక్షేత్రంలో ఉత్సవాలసభ జరుగుతుందని, కార్మికులు, కర్షకులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి యానాలి సాంబశివారెడ్డి, చానా, జ్వాలా నర్సింహారావు, కార్ల రాజు, లాలు, కందకూరి కష్ణవేణి, ఆదిలక్ష్మి, యోబు, అనిల్ సింగ్ తదితరులు పాల్గున్నారు.

విద్యార్థులకు అభినందన

ఖమ్మంఅర్బన్: నగరంలోని బొమ్మ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు బుధవారం విడుదలైన డిప్లొమా ద్వితీయ, తృతీయ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల చైర్మన్ బొమ్మ రాజేశ్వరరావు తెలిపారు. బుధవారం అధిక జీపీఏ సాధించిన విద్యార్థులు పి.సింధు, కార్తీక్, యశ్వంత్, శ్రీవలి, రేణుక, శ్రీజ, శ్రీలక్ష్మిలను కళాశాలలో అభినందించారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ వైస్ చైర్మన్ సత్యప్రసాద్, వివిధ విభాగాల అధిపతులు, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

కేంద్రమంత్రికి వినతి

కామేపల్లి: బీఎస్ఎన్ఎల్ సేవలను ప్రజలకు చేరువయ్యేలా మరింత విస్తృత పరచాలని కోరుతూ కేంద్ర టెలికమ్యూనికేషన్ మంత్రి ఆదిత్యసింధ్యాను బుధవారం ఢిల్లీలో గరిడేపల్లి గ్రామానికి చెందిన టీపీసీ సభ్యుడు భట్టు నాగేశ్వరరావు కోరారు. బీఎస్ఎన్ఎల్‌కు పూర్వ వైభవం వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జాతీయ కోశాధికారి భట్టు వెంకన్న పాల్గొన్నారు.

కలెక్టర్‌కు..


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆర్పీలు

ఖమ్మంమయూరిసెంటర్: మెప్మా రిసోర్స్ పర్సన్స్ (ఆర్పీ)లుగా పని చేస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఆర్పీలు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. తొలుత ఆర్పీల అధ్వర్యాన నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుని, తమ సమస్యలపై కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షురాలు ఓ సబీహా మాట్లాడుతూ.. ఏడు నెలలుగా తమకు వేతనాలు ఇవ్వడం లేదని, ఆర్పీలకు హెల్త్‌కార్డులు, ఐడీ కార్డులు ఉద్యోగ భద్రత, జీవిత బీమా తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి గంధసిరి పద్మ, కోశాధికారి బత్తుల మొగిలమ్మ, ఉపాధ్యక్షురాలు రత్నాకరం రమాదేవి, సహాయ కార్యదర్శి గుండెబోయిన లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

రఘునాథపాలెం: మండలంలోని కొర్లబోడు తండాలో తండ్రిపై దాడి చేసిన ఘటనలో కుమారుడిపై బుధవారం రఘునాథపాలెం స్టేషన్‌లో కేసు నమోదైనట్లు సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు. కొర్లబోడుతండాకు చెందిన భూక్యా మాలుని మంగళవారం అతడి చిన్నకొడుకు మంగీలాల్ మద్యం మత్తులో రాయితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. దీంతో మాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మాలు భార్య మంగీ ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేపట్టినట్లు సీఐ తెలిపారు.

దాడి ఘటనలో ఇద్దరిపై..

మండలంలోని పువ్వాడనగర్‌లో పోలీసులకు ఇంటి చిరునామా చూపించాడని ఆగ్రహించి ఓ వ్యక్తిపై దాడి చేసిన ఇద్దరిపై రఘునాథపాలెం పోలీసు స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. గ్రామానికి చెందిన రవి, అతడి భార్య గొడవపడ్డారు. దీనిపై భార్య డయల్ 100కు ఫోన్ చేయడంతో గ్రామానికి వెళ్లిన పోలీసులకు గ్రామానికి చెందిన షేక్ బాబా అడ్రస్ చెప్పారు. దీంతో ఆగ్రహించిన రవి, అతడి స్నేహితుడు అన్వేష్‌లు కలిసి బాబాపై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

దాడి సరికాదు

నేలకొండపల్లి: మంచిర్యాల జిల్లా ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కార్యదర్శి నయిమ్ పాషాపై దాడి చేయడం సరికాదని ఆ పార్టీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పసుమర్తి శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడారు. అవినీతిపై పోరాడితే దాడులు చేయడం సిగ్గుచేటని, దాడి చేసిన వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

శరవేగంగా ధాన్యం కొనుగోళ్లు


గన్నీ సంచులు అందిస్తున్న చైర్మన్ బాలాజీ

నేలకొండపల్లి: సొసైటీ పరిధిలోని చెరువుమాధారం, మంగాపురంతండాలో ఇప్పటి వరకు 59 వేల వరి ధాన్యం బస్తాలను కొనుగోలు చేసినట్లు రాజారాంపేట సొసైటీ చైర్మన్ డి.బాలాజీ పేర్కొన్నారు. బుధవారం మంగాపురంతండాలో రైతులకు గన్నీ సంచులను అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గత రెండు రోజుల క్రితం గన్నీ సంచుల కొరతపై మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లగా.. 25 వేల గన్నీ సంచులను సొసైటీకి అందించే ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రాజారాంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పరిధిలో మిగిలిన ధాన్యాన్ని శరవేగంగా కొనుగోలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి రామకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

హమాలీలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

ఖమ్మంమయూరిసెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం): హమాలీలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని టీయూసీఐ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకన్న, తెలంగాణ ప్రగతిశీల హమాలీ అండ్ మిల్లు వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో హమాలీలకు ఎలాంటి చట్టాలు వర్తించటం లేదని, ఇళ్లు లేక అద్దె ఇంట్లో ఉండాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. హమాలీలను వెట్టిచాకిరికి ఉపయోగిస్తున్నారే తప్ప వారికి ప్రభుత్వ ఫలాలు అందడం లేదని, వారికి ఉపాధి కల్పించడంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా నాయకులు బొమ్మకంటి రమేష్, పుల్లారావు, శ్రీను, తిరపయ్య, శోభన్, ఎం.నాగేశ్వరరావు, వి.సత్యం, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

‘త్రివేణి’ విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం సహకారనగర్: ఇటీవల నిర్వహించిన సీఎం కప్ టోర్నీలో బ్యాడ్మింటన్ విభాగంలో తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని త్రివేణి పాఠశాల డైరెక్టర్ గొల్లపుడి వీరేంద్రచౌదరి తెలిపారు. బుధవారం విద్యార్థులను అభినందించాక మాట్లాడారు. అబ్బూరి వినయ్, బచ్చు విశ్వతేజస్ తదితరులు జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. సీఆర్‌ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, త్రివేణి కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పాఠశాల ప్రిన్సిపాల్ పి.రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

కామేపల్లి: రైతులు వరి ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాలు పాటించి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని తహసీల్దార్ సుధాకర్, మండల వ్యవసాయాధికారి భూక్యా తారాదేవి అన్నారు. బుధవారం మండలంలోని పండితాపురం, లింగాల, కామేపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ మద్దతు ధర పొందాలంటే రైతులు ధాన్యాన్ని 17లోపు తేమ శాతం ఉండాలని, నాణ్యత పాటించి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ వేదిత, జగదీశ్, సొసైటీ సీఈఓ దొడ్డ ముత్తయ్య, గాదె నాగయ్య, రైతులు పాల్గొన్నారు.

రేపటి నుంచి యోగా శిక్షణ

రఘునాథపాలెం: ఈనెల 20 నుంచి 22 వరకు శ్రీరామ చంద్ర మిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఖమ్మం ఆధ్వర్యాన రఘునాథపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉచిత యోగా, ధ్యాన శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శ్రీనివాసరావు, బి.వీరబాబులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 21న ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా సాయంత్రం 5–30 గంటల నుంచి 7 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో 15ఏళ్లు దాటిన వారందరూ పాల్గొనవచ్చని, మరిన్ని వివరాలకు 99896 06020, 96660 22617, 88977 85484లలో సంప్రదించాలన్నారు.


మాలల అరెస్టుకు ఖండన

కామేపల్లి/తిరుమలాయపాలెం: నేడు హైదరాబాద్‌లో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకంగా చలో అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న మాలమహానాడు నాయకులకు బుధవారం పోలీసులు అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు పేర్కొన్నారు. అక్రమ అరెస్టుల ద్వారా పోరాటాన్ని ఆపలేరని, ఎప్పటికైనా ఎస్సీ వర్గీకరణ జరగనియ్యమన్నారు. కామేపల్లిలో అరెస్టు అయిన వారిలో కామేపల్లి మండల మాల మహానాడు నాయకులు ఆంతోటి అచ్చయ్య, దార సుందర్‌రావు, ఏనూటి రామనర్సయ్య, బాలశౌరి, మంచాల వెంకన్న, రాము, దానియేలు, కృష్ణ, చలమయ్య ఉన్నారు. అలాగే తిరుమలాపాలెంలో మాల మహానాడు రాష్ట్ర నాయకులు కొప్పుల అశోక్, పప్పుల శ్రీనివాసరావు, ప్రసాద్, మహేందర్, తుమాటి హాజరయ్య, ప్రకాష్, భూషణం, పిచ్చయ్య తదితరులు ఉన్నారు.

పరామర్శ

ఖమ్మంమయూరిసెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం): ఖమ్మం బీసీ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని లక్ష్మీభవానికీర్తి ఇటీవల ఎలుకల దాడిలో గాయపడి స్థానిక మమత ఆస్పత్రిలో వైద్యం పొందుతుండగా.. బుధవారం 23వ డివిజన్ కార్పొరేటర్ షేక్ మక్బూల్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాస్టల్ విద్యార్థుల సంక్షేమానికి అందాల్సిన సౌకర్యాలను వెంటనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రతీ ఒక్కరికి బీమా అవసరం


చెక్కు అందిస్తున్న బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్

కామేపల్లి: ప్రతి ఒక్కరూ జీవిత, ప్రమాద బీమా కలిగి ఉండాల్సిన అవసరం ఉందని పండితాపురం ఏపీజీవీ బ్యాంక్ మేనేజర్ పి.శ్రీనివాస్ అన్నారు. రఘునాథపాలెం మండలం పుఠానితండాకు చెందిన వాంకుడోత్ చందర్ ఏపీజీవీ బ్యాంక్ ఖాతాదారుడు ఇటీవల ప్రమాదవశాత్తు మరణించడంతో ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా కింద మంజూరైన రూ.2 లక్షల బీమా చెక్కును నామినిగా ఉన్న అతడి భార్య అరుణకు అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడారు. పంట రుణాల బకాయిల చెల్లింపు, మహిళల స్వయం సహాయక గ్రూప్ పెండింగ్ వివరాలను తెలియజేసి సకాలంలో చెల్లించడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. రైతులు పంట రుణం రూ.2 లక్షలలోపు ఉండేలా చూసుకోవాలని,ఏడాదిలోపే రెన్యువల్ చేసుకోవాలని రైతులకు సూచించారు. మహిళా గ్రూప్ సభ్యులు ప్రతి నెలా పొదుపు, అప్పులను గడువులోపు చెల్లిస్తే ప్రభుత్వ రాయితీలకు అర్హులవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్లు ప్రకాశ్, నవీన్, క్యాషియర్ ఉపేంద్రమ్మ, సిబ్బంది రామనాగయ్య, రాజేష్,ఉపేందర్ పాల్గొన్నారు.

మరోసారి కదలిక..


ఇందిరానగర్‌లోని ఓ దుకాణంలో వెలిసిన పోస్టర్

నగరంలో ప్లాస్టిక్ సంచుల నిషేధంపై మరోసారి కదిలిక వచ్చింది. గతంలో అనేక సార్లు ప్రచారం చేసినా కొన్ని రోజులు నిబంధనలు పాటించడం ఆతర్వాత వదిలేయడం.. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో యథావిధిగా ప్లాస్టిక్ సంచులు వాడేవారు. ఇటీవల కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ ఆదేశాలు మేరకు పలు దుకాణాల్లో ప్లాస్టిక్ సంచుల నిషేధంపై ప్రచారం సాగించారు. దీంతో దుకాణదారులు తమ దుకాణాల వద్ద వినియోగదారులకు తెలిసేలా ‘వినియోగదారులు దయచేసి చేతి సంచులు వెంట తెచ్చుకోగలరు’ అని పోస్టర్లు ప్రదర్శిస్తున్నారు. ఈ సారైనా నిషేధం మూణ్నాళ్ల ముచ్చటగానే ఉంటుందా లేక కఠినంగానే అమలు చేస్తారా అనేది వేచి చూడాలి.

– ఖమ్మంఅర్బన్